

కడప జట్టుపై నార్త్‌జోన్ విజయం
కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. కడప జట్టుపై నార్త్‌జోన్ జట్టు విజయం సాధించింది. -8లో



పాఠశాలల్లో శిక్ష సప్తాహ్
విద్యాభివృద్ధే లక్ష్యంగా 'శిక్ష సప్తాహ్' కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. ఇందులో భాగంగా ఆదివారం నుంచి 28 వరకు వారోత్సవాలు నిర్వహించనుంది. -8లో

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
32.0/25.2

జిల్లాలో శనివారం 25.2 - 32.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో వర్షం
కడప అగ్రికల్చర్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన కారణంగా జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో వర్షం కురిసింది. పోరుమామిళ్లలో అత్యధికంగా 37.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కలసపాడు 30.8, కాశినాయనలో 22.2, పెద్ద ముడియం 16.4, బి.కోడూరు 15.6, బద్వేల్ 14.2, మైలవరం 13.6, గోపవరం 12.6, రాజుపాలెం 10.6, చాపాడు 9.4 , ఖాజీపేట 8.2 , పొద్దుటూరు 7.6, జమ్మలమడుగు 6.4, వల్లూరు 5.8, సిద్దవటం, కమలాపురంలలో 5.6, చెన్నూరు 5.2, దువ్వూరు, ఎర్రగుంట్లలలో 4.8, సీకేదిన్నెలో 3.4, కొండాపురం, అట్లూరులలో 3.2, సింహాద్రిపురం 2.6 , ముద్దనూరు 2 ఎంఎం, కడప, ఒంటిమిట్టలలో 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ప్రతి సోమవారం డయల్ యువర్ కలెక్టర్
కడప సెవెన్‌రోడ్స్: ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు వీలుగా ఇకపై ప్రతి సోమవారం ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు 'డయల్ యువర్ కలెక్టర్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శివశంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. తాము సూచించిన ఈ సమయంలో ప్రజలు 08562-244437 అనే ల్యాండ్‌లైన్ నెంబరుకు ప్రజలు ఫోన్ చేసి తమ సమస్యలు తెలియజేయవచ్చన్నారు.

నేడు డిపార్టుమెంట్ పరీక్షలపై అవగాహన
కడప ఎడ్యుకేషన్: కడప ఎన్జీవో భవనంలో 21వ తేదీ ఆదివారం ఉదయం పది గంటలకు డిపార్టుమెంట్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఏపీటీఎఫ్ అమరావతి కడప జిల్లా అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు ఈశ్వరచంద్ర, అలీ ఖాన్ తెలిపారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్ విచ్చేసి నల్లబల్లపై డిపార్టుమెంటల్ పరీక్షల ప్రశ్నావళిని, సులభంగా ఉత్తీర్ణత సాధించడం ఎలాగో టిప్స్ అందిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు ప్రారంభిస్తారని తెలిపారు.


నేడు తైక్వాండో పోటీలు
ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక దేవాంగ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ ట్రెజరర్ సలీం తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ బాలబాలికలకు జూనియర్, సబ్‌జూనియర్, కేడెట్, సీనియర్ విభాగాల్లో పోటీలు జరుగుతాయన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనపరచి బంగారు పతకం సాధించిన క్రీడాకారులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరుపున ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. పోటీలకు ముఖ్య అతిథులుగా డీఎస్పీ మురళీధర్, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు శివశంకర్‌రెడ్డి, సెక్రటరీ నాయబ్‌రసూల్ హాజరవుతారన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన దాదాపు 200 మందికిపైగా తైక్వాండో క్రీడాకారులు పాల్గొంటారన్నారు.

నేడు బీడీ కార్మికుల రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం
కడప వైఎస్ఆర్ సర్కిల్: కార్మిక భవన్‌లో ఈనెల 21వ తేదీన ఏపీ బీడీ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం జరుగుతుందని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనురు శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. శనివారం కడపలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీడీ కార్మికుల సమస్యలను చర్చించడం కోసం బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర సమన్వయ కమిటీ సమావేశం కర్నూల్ లోని కార్మిక కర్షక భవన్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరవుతున్నారని చెప్పారు.

నేడు జీవశాస్త్ర ఉపాధ్యాయులకు ఆన్‌లైన్‌లో శిక్షణ
కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలలో పనిచేస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయులకు జూలై 21 ఆదివారం సాయంత్రం 5 నుండి 7 గంటల వరకు ఆన్‌లైన్‌లో శిక్షణా కార్యక్రమం ఉంటుందని జీవశాస్త్ర ఫోరం జిల్లా అధ్యక్షుడు బీపీ విజయ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామ్మోహన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శనివారం ఇక్కడ వారు మాట్లాడుతూ ఈ అకడమిక్ సంవత్సరం నూతనంగా ప్రవేశపెట్టిన 10వ తరగతి జీవశాస్త్ర పాఠ్యపుస్తకాన్ని గత పాఠ్యపుస్తకాల రెఫరెన్స్‌తో విద్యార్థులకు సమగ్రంగా బోధించడానికి, సీబీఎస్ఈ, స్టేట్ సిలబస్, పరీక్ష విధానంలో ఉన్న తేడాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.ఏపీ బీఎస్‌టీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సిఈఆర్టీ)అసెస్మెంట్ సెల్ కో ఆర్డినేటర్ శ్రీ మహమ్మద్ గౌస్, పాఠ్యపుస్తక రచయితలతో ఆన్‌లైన్‌లోఅవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వివరాలకు 94409 93198, 9441825940, 9492378327 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

దిక్కు లేని హక్కు

- భూముల రీ సర్వేకు చంద్రగ్రహణం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వే అమలు నిలిపివేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేసిన ప్రకటన.. రైతులను ఆందోళనకు గురిచేసింది. లక్షల రూపాయల ఖర్చుతో జరిగిన సర్వేలో లోపాలుంటే సరిదిద్ది.. పటిష్టంగా అమలు చేయాల్సిన టీడీపీ ప్రభుత్వం ఇలా ఏకంగా రద్దు నిర్ణయం తీసుకోవడంపై వారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కాలం చెల్లిన బ్రిటీష్ రికార్డుల స్థానంలో డిజిటల్ భూ రికార్డులు అందుబాటులోకి వస్తే తమ భూ వివాదాలకు తెర పడుతుందని భావించిన వారికి మొండిచేయి మిగిలింది.

- రీ సర్వే అమలు నిలిపేసిన టీడీపీ ప్రభుత్వం
- రద్దు చేయడం తగదంటున్న జిల్లా రైతులు
- సర్వేకు వెచ్చించిన సొమ్ము వృథాయేనా?
- పల్లెల్లో భూ వివాదాలకు చెక్ పెట్టేదెప్పుడో?


డ్రోన్‌తో రీ సర్వే


కడప సెవెన్‌రోడ్స్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోనే తొలి సారిగా రాష్ట్రంలో భూముల రీ సర్వేకు శ్రీకారం చుట్టారు. శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం పేరుతో 2020, డిసెంబరులో జిల్లాలోనూ ఈ రీసర్వే ప్రారంభించారు. ఇప్పటి వరకు మూడు విడతలుగా ఈ కార్యక్రమం చేపట్టగా.. మొత్తం 282 గ్రామాల్లో 4,56,277.40 ఎకరాల భూమిని రీ సర్వే చేశారు. లక్షల రూపాయలు వెచ్చించి డ్రోన్లు, రోవర్లు, కంటిన్యూవస్ ఆపరేటింగ్ రిఫరెన్స్ స్టేషన్లు (సీఓఆర్ఎస్) వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అట్టహాసంగా ఈ భూ సర్వే సాగింది. ప్రభుత్వ-ప్రైవేటు భూముల గుర్తింపు, గ్రామ పంచాయతీల్లో స్థలాలు, అర్బన్ భూములకు హద్దులు నిర్ణయించే ఈ కార్యక్రమాన్ని 2023 చివరి నాటికి పూర్తి చేయాలని గత ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది.

గతంలో భూ సర్వే ఇలా..

జిల్లాలో 1864లో భూ సెటిల్‌మెంట్ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. మొదట జమ్మలమడుగు తాలూకాలో డి మార్కేషన్ నిర్వహించారు. 1921 నాటికి రీసర్వే అండ్ రీ సెటిల్‌మెంట్ పూర్తిచేశారు. ప్రతి 30 ఏళ్ల కోమారు ఈ రీసర్వే నిర్వహించాల్సి ఉంటుంది. అయితే స్వాతంత్ర్యం వచ్చాక రీసర్వే నిర్వహించకపోవడంతో భూ వివాదాలు పెరిగాయి. వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రీసర్వే కోసం ప్రయత్నించి భూ భారతి ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. వివిధ కారణాలతో అప్పట్లో ఇది అర్ధంతరంగా నిలిచిపోయింది. దీంతో నాటి బ్రిటీష్ హయాంలో పాతిన సర్వే రాళ్ల ఆధారంగానే నేటికీ కొలతలు నిర్వహిస్తున్నారు. వందేళ్ల కాలంలో ఎంతో మంది భూముల యజమానులుగా మారారు. భాగ పరిష్కారాల మూలంగా భూముల స్వరూపం మారినప్పటికీ సర్వే నంబర్లు అవే కొనసాగుతున్నాయి. వందేళ్ల నాటి ఎఫ్ఎంబీల ఆధారంగా భూముల సర్వే నిర్వహణ సమస్య అవుతోందని పలుమార్లు అధికారులు ఆవేదన వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. ఈ భూ రికార్డుల విషయంలో సమగ్రత లేకపోవడంతో వివాదాలు పెరిగాయి. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మళ్లీ భూ సర్వేకు శ్రీకారం చుట్టారు. శాశ్వత భూ హక్కు-భూ రక్ష పథకం పేరుతో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జిల్లాలో పెద్ద ఎత్తున సర్వే కొనసాగింది. దాదాపు 4.5లక్షల ఎకరాల్లో సర్వే పూర్తి చేశారు. ఇందుకోసం లక్షల రూపాయలు వెచ్చించారు.

బాబూ.. నీకిది తగునా..

రీసర్వే పేరుతో భూముల సరిహద్దులు మార్చి వేశారు.. రైతుల భూముల విస్తీర్ణాలు తగ్గాయి.. కాబట్టి గతంలో నిర్వహించిన రీసర్వే అమలు నిలిపివేస్తున్నామంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. లోపాలను సరిదిద్ది గత ప్రభుత్వం చేపట్టిన పథకం కొనసాగించాల్సిన టీడీపీ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంతో భూ యజమానులు విస్తుపోతున్నారు. పూర్వం బ్రిటీషర్లు గొలుసు, క్రాస్టాఫ్‌తో మ్యాన్యువల్‌గా సర్వే నిర్వహించారు. ఆ సమయంలో ఎకరాకు ఐదు సెంట్ల స్థలం చొప్పున అలవెన్స్ ఇచ్చారు. ఇప్పుడు అధునాతన శాటిలైట్ సర్వే కారణంగా ఆ అలవెన్స్ ఉండదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. అధునాతన పరికరాలతో నిర్వహిస్తున్న సర్వేలో అణువంత పొరపాటు జరగదని వారు చెబుతున్నా టీడీపీ ప్రభుత్వానికి పట్టడం లేదు. అలవెన్స్ లేకపోవడంతోనే తమ భూమి విస్తీర్ణం తగ్గిపోయిందని రైతులు ఫిర్యాదు చేస్తున్నారేగానీ.. ఇందులో నిజం లేదని అధికారులు నిర్ధారిస్తున్నారు. రైతులకు వాస్తవంగా ఉన్న భూమి, అడంగల్‌లో విస్తీర్ణానికి తేడాలుండడంతో తమ భూమి తగ్గించారని రైతులు ఆరోపిస్తున్నారని వారు చెబుతున్నారు. రీ సర్వే-2023 చివరి నాటికి పూర్తి చేయాలని ఉన్నతాధికారులు తొందరపెట్టడంతో కొన్ని పొరపాట్లు జరిగిన మాట వాస్తవమేనని.. లోపాలు సరిదిద్దితే చాలు అని వివరిస్తున్నారు. ఈ విషయాన్ని తాము ఉన్నతాధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లామని పేర్కొంటున్నారు. ఇవన్నీ విస్మరించి రీసర్వే అమలు రద్దు చేస్తున్నట్లు ప్రకటించడంపై వారు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.



విడతల వారీగా భూ రీసర్వే వివరాలిలా...

డివిజన్	గ్రామాలు	భూముల విస్తీర్ణం (ఎకరాల్లో)
మొదటి దశ		
బద్వేలు	19	16415.45
జమ్మలమడుగు	18	34507.10
కడప	29	17768.85
పులివెందుల	20	29787.43
మొత్తం	86	98478.83
రెండవ దశ		
బద్వేలు	25	20064.14
జమ్మలమడుగు	41	68957.71
కడప	26	32718.91
పులివెందుల	07	10701.64
మొత్తం	99	132442.40
మూడో దశ		
బద్వేలు	39	76390.73
జమ్మలమడుగు	34	85390.35
కడప	05	8055.13
పులివెందుల	19	55519.96
మొత్తం	97	225356.17

రీ సర్వే రద్దు చేయడం సరికాదు



గత ప్రభుత్వం చేపట్టిన రీ సర్వేలో లోపాలు ఉన్న మాట నిజం. అయితే క్షేత్ర స్థాయిలో వాటిని పరిష్కరించకుండా ఏకంగా రీ సర్వేనే రద్దు చేయడం సరికాదు. వందేళ్ల క్రితం బ్రిటీషర్లు నిర్వహించిన తర్వాత మళ్లీ ఎప్పుడూ సర్వే జరగకపోవడంతో గ్రామాల్లో భూ వివాదాలు విపరీతంగా పెరిగాయి. వీటన్నింటికీ రీ సర్వే ఒక్కటే పరిష్కారం అవుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి లోపాలు సరిదిద్ది.. మెరుగైన రీ సర్వే చేపడితే అందరూ హర్షిస్తారు.

– ఎంవీ సుబ్బారెడ్డి, అధ్యక్షులు, ఏపీ రైతు సంఘం జిల్లా శాఖ

నిపుణుల కమిటీ ఏర్పాటుచేయాలి



భూమి రీసర్వేలో లోపాలు సరిచేసేందుకు నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటుచేయాలి. పేదలైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఉన్న చిన్న కమతాల రక్షణకు ఢోకా లేకుండా భూ సర్వే జరగాలి. ఇందుకోసం భూ సమస్యలపై అపార అనుభవం కలిగిన ఐఏఎస్ అధికారులు, నిపుణులతో కమిటీ ఏర్పాటుచేయాలి. రాష్ట్రమంతటా తిరిగి సమగ్ర సమాచారం సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి ఇవ్వాలి. అఖిలపక్ష సమావేశం నిర్వహించిన తర్వాత ప్రభుత్వం వాస్తవ పరిస్థితి ఆధారంగా రీ సర్వే జరపాలి.

– చంద్రశేఖర్, సీపీఎం జిల్లా కార్యదర్శి, కడప

కమనీయం.. సౌమ్యనాథుడి కల్యాణం

- హరినామస్మరణలతో పులకించిన సౌమ్యనాథస్వామి ఆలయం


ముత్యాల తలంబ్రాలు తీసుకు వస్తున్న ఆకేపాటి


సౌమ్యనాథుని కల్యాణంలో మాంగళ్యం చూపుతున్న అర్చకులు


కల్యాణానికి హాజరైన భక్తులు

నందలూరు: సౌమ్యనాథస్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామి కల్యాణం చూచువారలకు చూడ ముచ్చటగా అన్న విధంగా సాగింది. కల్యాణ వేడుకలను తిలకించేందుకు వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పుష్పాలతో వేదికను అలంకరించారు. ఆలయ అర్చకులు సునీల్ సుమార్ శర్మ బృందంచే శ్రీదేవి, భూదేవి సమేత సౌమ్యనాథస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ వేడుకలకు ఉత్సవ మూర్తులను ముస్తాబు చేసి మేళతాళాల మధ్య కల్యాణ వేదికపై ఆశీనులు చేశారు. పండితుల మంత్రోచ్చారణలు, పసుపులేటి శంకర్ వ్యాఖ్యానం, భక్తుల గోవింద నామస్మరణలతో ఆలయం భక్తి పారవశ్యంతో నిండిపోయింది. వేదపండితులు, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో మాంగళ్య ధారణ, ముత్యాల తలంబ్రాలు క్రతువులను నిర్వహించారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, టీటీడీ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. ఆర్టీసీ మాజీ రీజనల్ చైర్మన్ ఎద్దుల సుబ్బరాయుడు, రాజంపేట ఆర్డీఓ మోహన్‌రావు, టీడీపీ రాజంపేట ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం, ప్రముఖ నటుడు, దర్శకులు తోట వేణుగోపాల్ హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి మేడా విజయశేఖర్ రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాయలసీమ గ్రామీణ బ్యాంకు మేనేజర్ అరుణ్, జాహ్నవిదర్, కుమార్, శ్రీనివాసరావు, నరసింహులు ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. డీఎస్పీ వీఎన్‌కె చైతన్య, మన్నూరు సీఐ మంజునాథరెడ్డి ఆధ్వర్యంలో ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్, పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వర్ణాంధ్ర సంస్థ అధ్యక్షుడు వేపగుంట శ్యామ్రాజ్ ఆధ్వర్యంలో స్కౌట్ సభ్యులు భక్తులకు సేవలు అందించారు. కల్యాణ మహోత్సవం అనంతరం శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి మాఢవీధులలో విహరించారు. రాత్రి సౌమ్యనాథస్వామి గజ వాహనంపై ఊరేగారు. ఈ కార్యక్రమంలో టీటీడీ సూపరింటెండెంట్ హనుమంతు, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్ కుమార్, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

- బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం రథోత్సవం నిర్వహించేందుకు నిర్వహకులు ఏర్పాట్లు చేశారు.

రైతు సేవలో ముందుండాలి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

మైదుకూరు: రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులు రైతు సేవలో ముందుండాలని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు అన్నారు. మైదుకూరులో శనివారం మైదుకూరు వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని వ్యవసాయ సహాయకులకు వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో పలు అంశాలపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ సహాయకులు పంట సాగులో రైతులకు తమ సహాయ సహకారాలు నిరంతరం అందిస్తూ ఉండాలన్నారు. వరి యాజమాన్య పద్ధతులపై డాట్ సెంటర్ శాస్త్రవేత్త అంకయ్య కుమార్ వివరించారు. వనిపెంట కేవీకే శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి వేరుశెనగలో యాజమాన్య పద్ధతులపై, ఫిరోజ్ హుస్సేన్ పసుపులో యాజమాన్య పద్ధతులపై వివరించారు. రైతు శిక్షణ కేంద్రం డీడీఏ ఎంవీ రమనారెడ్డి, ఆత్మ డీపీడీ పద్మలత, మైదుకూరు ఏడీఏ కృష్ణమూర్తి, సబ్ డివిజన్ పరిధిలోని ఏఓలు పాల్గొన్నారు.

భూ సేకరణ పనుల్లో వేగం పెంచాలి: కలెక్టర్


మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్: జాతీయ రహదారుల కోసం చేపడుతున్న భూ సేకరణ పనుల్లో వేగం పెంచాలని కలెక్టర్ శివశంకర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ గ్రీవెన్స్ సెల్ హాలులో జేసీ గణేష్‌కుమార్, డీఎఫ్ఓ సందీప్‌రెడ్డిలతో కలిసి అధికారులు, ఇంజనీర్లతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. రహదారులను విస్తృత పరిచి రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు పనులు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా జిల్లా మీదుగా వెళుతున్న జాతీయ రహ దారులు, రైల్వే లైన్ల నిర్మాణం కోసం అదనంగా చేపడుతున్న భూ సేకరణ పనులు త్వరగా పూర్తి కావాలని చెప్పారు. అటవీ, పర్యావరణ, కోర్టు సంబంధిత అంశాలపై అభ్యంతరాలు ఉంటే త్వరగా క్లియర్ చేయాలన్నారు. జాతీయ రహదారులు, రైల్వే, ఇరిగేషన్, ట్రాన్స్‌కో, భూగర్భ జలశాఖ, రెవెన్యూ అధికారులు సమన్వయంతో నిర్దేశిత గడువులోపు భూ సేకరణ పూర్తి చేయాలన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిధిలోని భూ సేకరణ గురించి ఆరా తీశారు. రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఆర్డీఓలు భూ సేకరణ పెండింగ్ పనులను పునః పరిశీలించి వచ్చే సమావేశంలో సాధ్యాసాధ్యాల నివేదికలు సమర్పించాలన్నారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైఎస్సార్, అన్నమయ్య జాయింట్ కలెక్టర్లు బదిలీ


అదితి సింగ్

కడప కార్పొరేషన్: వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల జాయింట్ కలెక్టర్లతో పాటు కడప నగర పాలక సంస్థ కమిషనర్ బదిలీ అయ్యారు. వైఎస్సార్ జిల్లా జేసీ గణేష్ కుమార్‌ను స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తున్న అదితి సింగ్‌ను నియమించారు.

అన్నమయ్య జేసీగా ఆదర్శ రాజేంద్రన్


ఆదర్శ రాజేంద్రన్

రాయచోటి: అన్నమయ్య జిల్లా జేసీగా పనిచేస్తున్న ఫర్మాన్ అహ్మద్ ఖాన్ శ్రీకాకుళం జేసీగా వెళ్లారు. ఆయన స్థానంలో విజయవాడలోని ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సీఈఓగా పనిచేస్తున్న ఆదర్శ రాజేంద్రన్‌ను నియమించారు.

కడప కమిషనర్‌గా తేజ్ భరత్


తేజ్‌భరత్

కడప నగరపాలక సంస్థ కమిషనర్‌గా పనిచేస్తున్న జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్‌ను సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్‌గా నియమించారు. ప్రవీణ్‌చంద్ స్థానంలో తూర్పు గోదావరి జిల్లా జేసీగా పనిచేస్తున్న ఎస్. తేజ్‌భరత్‌ను నియమించారు. ప్రవీణ్‌చంద్ రెండేళ్లకుపైగా కడప కమిషనర్‌గా ఉన్నారు. రోడ్ల విస్తరణ, బుగ్గవంక సుందరీకరణ, నగరాభివృద్ధి పనుల్లో ఆయన వేగం పెంచారు.

రాజంపేట సబ్‌కలెక్టర్‌గా నిదియా దేవి, మదనపల్లెకు మేఘా స్వరూప్


వైఖోమ్ నిదియాదేవి


మేఘాస్వరూప్

రాజంపేట/మదనపల్లె: రాజంపేట సబ్‌కలెక్టర్‌గా వైఖోమ్ నిదియా దేవి నియమితులయ్యారు. ఈమె ప్రస్తుతం అనంతపురం జెడ్పీ సీఈఓగా పనిచేస్తున్నారు. ఈమె స్వస్థలం మణిపూర్. అనంతపురం మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న ఈమె భర్త మేఘాస్వరూప్‌ను మదనపల్లె సబ్‌కలెక్టర్‌గా బదిలీ చేశారు. అన్నమయ్య జిల్లా ఏర్పాటైన తర్వాత మదనపల్లె రెవెన్యూ డివిజన్‌కు ఆర్డీఓలే బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు.



క్లుప్తంగా

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



తరగతులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

వైవీయూ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌గా ఆచార్య కె.కృష్ణారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం నియమించడాన్ని నిరసిస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం వైవీయూలో తరగతులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గుజ్జుల వలరాజు మాట్లాడుతూ ఇన్‌చార్జి వీసీగా నియమితులైన ఆచార్య కృష్ణారెడ్డి కృష్ణా విశ్వవిద్యాలయంలోనూ, వైవీయూ ప్రిన్సిపాల్‌గా పనిచేసిన సమయంలో ఎన్నో ఆరోపణలు వచ్చాయన్నారు. వైవీయూలో జరిగిన ఘటనపై కమిటీ వేసి చర్యలు తీసుకున్నారన్నారు. అలాంటి వ్యక్తికి ఉన్నతమైన వైస్ చాన్సలర్ పదవి కట్టబెట్టడం ఏమిటంటూ వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నగర ఉపాధ్యక్షులు చంద్ర, శివతేజ, అకీరానంద్, అశోక్, మస్తాన్, సల్మాన్ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపై బ్లేడ్‌తో కుమారుడి దాడి

కడప అర్బన్ : కడప నగరంలోని రాజారెడ్డి వీధిలో నివాసముంటున్న కొండమ్మపై ఆమె కుమారుడు రాకేష్ బ్లేడ్‌తో దాడి చేయడంతో చేతికి గాయమైంది. తనకు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని కుమారుడు ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. ఈ సంఘటనపై పోలీసులు విచారిస్తున్నారు.

పోలీసుల అదుపులో హత్య కేసు నిందితుడు

కడప అర్బన్ : కడప నగరంలోని పుత్తా ఎస్టేట్స్ వద్ద దారుణ హత్యకు గురైన చింపిరి వెంకటేష్ కేసులో సాదిక్‌వలి అనే వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అతడిని సమగ్రంగా విచారించి అరెస్ట్ చేయనున్నట్లు తెలిసింది.

డీఈవో కార్యాయంపై దాడిలో ఐదుగురిపై కేసు నమోదు

కడప అర్బన్ : కడప నగరంలోని డీఈఓ కార్యాలయంపై దాడి సంఘటలో ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రెండు రోజుల కిందట పాత అర్‌జేడీపై విచారణకు ఆటంకం కలిగించేలా ఐదుగురు ఘర్షణకు దిగి దాడి చేసి, తన సెల్‌ఫోన్ పగులగొట్టారని బాధిత ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సుండుపల్లి ఎంఈఓ వెంకటేష్‌నాయక్, ఉపాధ్యాయులు గడ్డం ఆదినారాయణ రెడ్డి, నాగమునిరెడ్డి, శివకుమార్‌రెడ్డి, రామకృష్ణలపై కేసు నమోదు చేశారు.

పాఠశాలల్లో శిక్ష సప్తాహ్

కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యావిధానం (ఎన్‌పీ-2020) ప్రవేశ పెట్టి నాలుగేళ్లు పూర్తవుతున్న సందర్భంగా వారోత్సవాల నిర్వహణకు సమాయత్తమవుతోంది. ఈ నెల 22వ తేదీ నుంచి 28వతేదీ వరకు 'శిక్ష సప్తాహ్' పేరుతో జిల్లాలో పలు కార్యక్రమాలు చేపట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.

- జాతీయ విద్యా విధానం అమలుకు నాలుగేళ్లు
- రేపటి నుంచి 28వ తేదీ వరకు వారోత్సవాలు
- తల్లిదండ్రులు, స్థానికుల భాగస్వామానికి కసరత్తు
- మార్గదర్శకాలు జారీ చేసిన రాష్ట్ర సమగ్రశిక్ష శాఖ

కడప ఎడ్యుకేషన్ : విద్యాభివృద్ధే లక్ష్యంగా 'శిక్ష సప్తాహ్' కార్యక్రమాన్ని జిల్లా విద్యాశాఖ ప్రకటించింది. అప్పటివరకు ఉన్న 10+2+3 విద్యా విధానం బదులు డాక్టర్ కృష్ణస్వామి కస్తూరిరంగన్ సిఫార్సుల మేరకు ఈ నూతన జాతీయ విద్యా విధానం రూపకల్పన జరిగింది. ఈ ఎన్‌ఈపీ-2020లో 5+3+3+4 పాఠశాల విధానాన్ని ప్రవేశపెట్టగా, 2020 జూలై, 29న కేంద్రం ఆమోదించింది. ఈ విధానాన్ని ప్రజల్లోకి తీసుకవెళ్లేలా శిక్ష సప్తాహ్ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానికులు భాగస్వాములు కావాలని మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

వారోత్సవాలు ఇలా..

శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యాభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలతో ఈ నెల 22వ తేదీ నుంచి 28వతేదీ వరకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది.

జూలై 22న సామగ్రి ప్రదర్శన

స్థానిక వనరులతో బోధన సామగ్రి ప్రదర్శన నిర్వహిస్తారు. ఉపాధ్యాయులు స్థానికంగా లభించే వనరులతో తయారుచేసిన బోధన అభ్యసన సామాగ్రిని ఈ ప్రదర్శనలో ఉంచుతారు. విద్యార్థుల తల్లితండ్రులు, స్థానిక పెద్దలు ఇందులో భాగస్వాములవుతారు.

23న పునాది అభ్యసన

ఒకటో తరగతి నుంచి బాషపై పట్టు సాధించేందుకు పునాది అభ్యసనం, గణితంలోని సంఖ్య శాస్త్రం నైపుణ్యాల అభివృద్ధి అమలు చేసే విషయంలో చర్చిస్తారు.

24న క్రీడా దినోత్సవం

విద్యార్థులకు శారీరక సౌష్టవ ప్రాధాన్యం తెలిసేలా వివిధ రకాల క్రీడాంశాలపై పోటీలు నిర్వహించడం. ప్రాధాన్యతను వివరించడం.

25న సాంస్కృతిక దినోత్సవం

విద్యార్థులలో భిన్నత్వంలో ఏకత్వం భావాన్ని పెంపొందించడం. ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు(ఫ్యాన్సీడ్రెస్, పాటలు, నృత్య ప్రదర్శన, నాటికలు) నిర్వహించడం.

26న సాంకేతిక నైపుణ్యాల దినోత్సవం

స్కిల్, డిజిటల్ ఇన్షియేటివ్ డే పేరుతో ఉద్యోగావకాశాల నేపథ్యంలో అన్ని తరగతుల వారికి నూతన నైపుణ్యాల అవసరాన్ని గుర్తించడం, విద్యలో సాంకేతిక అభివృద్ధిని గుర్తించేలా చర్చించడం.

27న పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

పర్యావరణ పరిరక్షణ సంకల్పయాత్ర కృత్యాల (మిషన్ లైఫ్ యాక్టివిటీస్) కార్యక్రమంలో భాగంగా పాఠశాలలో పోషణ దినోత్సవ నిర్వహణ, కొత్త ఎకో క్లబ్‌ల ఏర్పాటు, విద్యార్థులు, వారి తల్లులు, మాతృభూమి మధ్య బంధాన్ని బలోపేతం చేయడంపై అవగాహన. బడిలో కనీసం 35 మొక్కలు నాటించేలా ఉపాధ్యాయులు కృషిచేయాలి.

28న సామాజిక భాగస్వామ్య దినోత్సవం

విద్యార్థుల సామాజిక భావోద్వేగ శ్రేయస్సు కోసం స్థానిక ప్రజలు, తల్లిదండ్రుల కమిటీలు, తల్లిదండ్రుల ఉపాధ్యాయ సంఘాల సహకారంతో పుట్టిన రోజులు, ప్రత్యేక సందర్భాలలో తిథి భోజనాలు నిర్వహించడం, సహపంక్తి భోజనం చేయడం నిర్వహించాలి.



ఒంటిమిట్ట మండలం రామచంద్రాపురం ప్రాథమిక పాఠశాల

అందరూ భాగస్వాములు కావాలి



రాష్ట్ర సమగ్ర శిక్ష జారీ చేసిన ఈ శిక్ష సప్తాహ్ కార్యక్రమాన్ని అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలి. ఇందుకు సంబంధించిన ఫొటోలతో డాక్యుమెంటేషన్ చేయాలి. ఈ కార్యక్రమ నిర్వహణ, అమలుపరిచే విధి విదానాలు జారీ చేశాం.

– రామాంజనేయరెడ్డి, అసిస్టెంట్ మానిటరింగ్ ఆఫీసర్, సమగ్ర శిక్ష

మార్గదర్శకాల ప్రకారం నిర్వహించాలి..



రాష్ట్ర సమగ్రశిక్ష అధికారులు జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి పాఠశాలలో సప్త శిక్షాహ్ కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలి. జిల్లాలోని డిప్యూటీ డీఈఓలు, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారులు, ఎంఈఓలు విజయవంతం చేసేందుకు కృషి చేయాలి.

– మర్రెడ్డి అనురాధ, జిల్లా విద్యాశాఖ అధికారి

ఫొటోగ్రఫీ పోటీలకు ఎంట్రీల ఆహ్వానం

కడప కల్చరల్ : ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల ఫొటోగ్రాఫర్లకు పోటీలు నిర్వహించనున్నట్లు ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, ఆంధ్ర ప్రదేశ్ ఫొటోగ్రాఫర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు పద్మప్రియ చంద్రారెడ్డి తెలిపారు. తమ సంఘం కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ ఆగస్టు 18న ఆదివారం ఉదయం పది గంటలకు కడప నగరం హౌసింగ్ బోర్డు కాలనీలోని కోదండ రామాలయ ధ్యాన మందిరంలో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఔత్సాహిక, వృత్తి ఫొటోగ్రాఫర్ల విభాగాలలో నిర్వహించే పోటీలలో ఒక్కొక్కరూ రెండు ఫొటోలు పోటీకి తీసుకురావచ్చన్నారు. జిల్లా పర్యాటక, వారసత్వ విశేషాలను తెలిపే 8x12 సైజు ఫొటో ఒకటి, వ్యక్తిగత సృజనాత్మకతను తెలిపే 12x18 సైజు ఫొటో మరొకటి పోటీలకు అనుమతిస్తామన్నారు. ఔత్సాహిక, వృత్తి విభాగపు ఫొటోగ్రాఫర్లలో ప్రతిభ కనబరిచిన 12మందిని గుర్తించి ఆగస్టు 19న ప్రత్యేక సభలో బహుమతులు అందజేస్తామన్నారు. ఆగస్టు 5వ తేదీలోగా ఫొటోలను పంపాలని సూచించారు. పూర్తి వివరాలకు 99662 22246 లేదా 83285 28076 నెంబరులో సంప్రదించాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో కొండూరు జనార్దన్‌రాజు, అనంతబొట్ల వెంకట సుబ్బయ్య, చెన్నంరెడ్డి శంకర్‌రెడ్డి, వరశివరామకృష్ణ పాల్గొన్నారు.

దివ్యాంగులకు మళ్లీ పరీక్షలు

వికలాంగ సర్టిఫికెట్‌తో మెలిక

కాశినాయన : వికలాంగులకు పింఛను ఇవ్వాల్సిన ప్రభుత్వం మళ్లీ అడ్డు గీతలు వేస్తోంది. గతంలో కడప రిమ్స్, పులివెందుల, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రుల్లో వికలాంగ ధ్రువపత్రాలు పొంది పింఛను పొందుతున్న 3432 మందిని మళ్లీ వికలత్వ పరీక్షలు చేయించుకోవాలని ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా నుంచి వచ్చిన జాబితా ప్రకారం సచివాలయ ఉద్యోగులు వారికి తాఖీదులు ఇవ్వనున్నారు. ఈ నెల 25వ తేదీన రిమ్స్‌లో వారంతా పరీక్షలు చేయించుకుని ప్రభుత్వానికి మళ్లీ ధ్రువ పత్రాలు సమర్పిస్తేనే పింఛన్ అందించేందుకు వీలవుతుంది. నూతన టీడీపీ ప్రభుత్వం వికలాంగ పింఛనుదారులకు రూ.6 వేలు ఇస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించడంతో ప్రభుత్వంపై అధిక భారం పడనుంది. ఈ నేపథ్యంలో ముందుగా ఆయా జిల్లాల వారీగా పరీక్షలు నిర్వహించి అసలైన వికలాంగులను గుర్తించాలని సూచించింది.

తాఖీదులు అందజేశాం

ఇతర జిల్లాల్లో వికలత్వ సర్టిఫికెట్లు పొందిన వారి జాబితా తయారుచేసి గ్రామ సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్ ద్వారా వారికి తాఖీదులు అందజేశాం. ఈ నెల 25వ తేదీలోగా వారు కడప రిమ్స్‌కు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలి. ఈ జిల్లాలో సర్టిఫికెట్లు పొందిన వారి జాబితా అధికారులు తయారు చేస్తున్నారు.

– మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ, కాశినాయన మండలం

సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్‌ఆర్టీసీని ఆదరిస్తున్న ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇస్తామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. పొలిమేర గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రయాణికుల అవసరాల మేరకు రీజియన్ పరిధిలో బస్సు తిప్పేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమంలో పలువురు తమ సమస్యలు విన్నవించారు. ఎర్రగుంట్ల రైల్వే స్టేషన్ సమీపంలోని ఎస్‌బీఐ వద్ద ఎక్స్‌ప్రెస్ బస్సు ఆపడం లేదని, ప్రొద్దుటూరు-ఎర్రగుంట్ల మధ్య ఉదయం బస్సుల సంఖ్య పెంచాలని, కర్నూలు వైపు వెళ్లే బస్సులు ఉదయం 8.30 గంటల వరకు దువ్వూరుకు వెళ్లడం లేదని కొందరు ఫిర్యాదు చేశారు. కడప నుంచి ఉదయం 7.00-7.30 గంటల మధ్య పులివెందులకు బస్సు నడపాలని మరింత మంది కోరారు. కడప డిపోలో మరో బస్సు పాస్ కౌంటర్ ఏర్పాటుచేయాలని కోరారు. బి.మఠంలో ఉదయం బద్వేల్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని, బద్వేలు-కడప మధ్య అధికంగా బస్సులు నడపాలని మరింతమంది విజ్ఞప్తి చేశారు. కడప-ప్రొద్దుటూరు దారిలో 6-7గంటల మధ్య బస్సులు తిరిగేలా చర్యలు తీసుకోవాలని కొందరు కోరారు. ఆయా డిపో మేనేజర్ల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని సూచించినట్లు గోపాల్‌రెడ్డి తెలిపారు.

కడప జట్టుపై నార్త్‌జోన్ విజయం


రాజారెడ్డి మైదానంలో తలపడుతున్న విశాఖ, సెంట్రల్‌జోన్ జట్లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, రెస్టాఫ్ నార్త్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు 43 ఓవర్లలో 159 పరుగులకే ఆలౌట్ అయింది. జట్టులోని గురుచరణ్ 43 పరుగులు చేశాడు. నార్త్‌జోన్ బౌలర్లు మోసెస్ 3, సుశాంత్ 3 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నార్త్‌జోన్ జట్టు 32.5 ఓవర్లలోనే 160 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని మురళి 36 పరుగులు చేశాడు.

రెస్టాఫ్ సెంట్రల్ జోన్ జట్టు విజయకేతనం

వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ క్రికెట్ మైదానంలో విశాఖపట్నం, రెస్టాఫ్ సెంట్రల్ జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన విశాఖ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 280 పరుగులు చేసింది. జట్టులోని ఈశ్వర్ రిత్విక్ 101 పరుగులు, ప్రితిక్ వర్మ 81 పరుగులు చేశారు. సెంట్రల్‌జోన్ బౌలర్ సాత్విక్ 4 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన రెస్టాఫ్ సెంట్రల్ జోన్ జట్టు 46.5 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 284 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని కె. ఆనంద్ 95 బంతుల్లో 129 పరుగులతో రాణించాడు. ఈయనకు జతగా రేవంత్ నాగకుమార్ 63 పరుగులు చేశారు. రెస్టాఫ్ సెంట్రల్ జోన్ జట్టు 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది.

రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్టు గెలుపు

కేఓఆర్‌ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కృష్ణా, రెస్టాఫ్ సౌత్‌జోన్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 263 పరుగులు చేసింది. జట్టులోని నిశ్చయ్ 76 పరుగులు, ఖాజామొహిద్దీన్ 52 పరుగులు చేశారు. సౌత్‌జోన్ బౌలర్ బాలాజీ 5 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన సౌత్‌జోన్ జట్టు 48.4 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 265 పరుగులు చేసి విజయం సాధించింది. జట్టులోని జయతీకృష్ణ 85 పరుగులు, హనీష్ వీరారెడ్డి 57 పరుగులు చేశాడు. దీంతో సౌత్‌జోన్ జట్టు 4 వికెట్ల తేడాతో విజయం సాధించింది.


129 పరుగులు చేసిన సెంట్రల్‌జోన్ బ్యాట్స్‌మన్ కె. ఆనంద్


101 పరుగులు చేసిన విశాఖ బ్యాట్స్‌మన్ ఈశ్వర్ రిత్విక్


5 వికెట్లు తీసిన సౌత్‌జోన్ బౌలర్ బాలాజీ

22న ఆశా కార్యకర్తల ధర్నా



మాట్లాడుతున్న మరియమ్మ

కడప వైఎస్సార్ సర్కిల్ : ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలని ఈ నెల 22న కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టినట్లు ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా అధ్యక్షుడు యు.మరియమ్మ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.శాంతమ్మ తెలిపారు. నగరంలోని ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలను బలవంతంగా రాజీనామా చేయించి, వారి స్థానంలో తమ పార్టీ వారిని నియమించుకోవాలని టీడీపీ నాయకులు కుట్ర చేస్తున్నారన్నారు. ఆశాలపై తప్పుడు ఫిర్యాదులు చేసి అధికారులతో తాఖీదులు జారీ చేయిస్తూ వేధింపులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గత 17 ఏళ్లుగా గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు సేవలందిస్తూ కరోనా కాలంలోనూ ప్రాణాలకు తెగించి పనిచేసిన ఆశాలను తొలగించాలని భావించడం అధికార పార్టీ నాయకుల మూర్ఖత్వం అన్నారు. ఆశాలకు కనీస వేతనం చెల్లించాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవ్‌తో కూడిన మెటర్నటీ లీవ్ ఇవ్వాలన్నారు. చనిపోయిన ఆశా కార్యకర్తలకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని, పదవీ విరమణ పొందిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. వైద్య సిబ్బందిగా వారిని శాశ్వత ప్రాతిపదికన గుర్తించాలని, తమ సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సి.అమ్ములు, నారాయణమ్మ, పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించి.. ప్రమాదాలు నివారించండి

కడప నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి గరికపాటి దీనబాబు


హెల్మెట్ ధరించాలనీ ర్యాలీని ప్రారంభిస్తున్న న్యాయమూర్తులు దీనబాబు, ప్రత్యూషకుమారి

కడప అర్బన్ : హెల్మెట్ ధరించి ప్రమాదాలు నివారించుకోవాలని నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి గరికపాటి దీనబాబు అన్నారు. రాష్ట్ర న్యాయసేవాధికారసంస్థ సూచన మేరకు శనివారం హెల్మెట్‌ల పంపిణీ, ర్యాలీ నిర్వహించారు. అదనపు జిల్లా న్యాయమూర్తి గరికపాటి దీనబాబు మాట్లాడుతూ రోడ్డు భద్రతకు ఎలక్ట్రానిక్ పరికరాలైన స్పీడ్ కెమెరా, క్లోజ్డ్ సర్క్యూట్, టెలివిజన్ కెమెరా, స్పీడ్ గన్, బాడీ వేరిబుల్ కెమెరా, తదితర పరికరాలను వాడుతున్నట్లు తెలిపారు. జడ్జి కె. ప్రత్యూష కుమారి మాట్లాడుతూ హెల్మెట్ వాడకపోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఐఎస్ఐ మార్కుగల నాణ్యమైన హెల్మెట్ వాడాలన్నారు. అనంతరం కెనరా బ్యాంక్ సహకారంతో గిరిజనులు, కార్మికులు, ట్రాన్స్‌జెండర్లకు హెల్మెట్‌లను ఉచితంగా పంపిణీ చేశారు. తరువాత కోర్టు ఆవరణం నుంచి ఏపీఎస్ఆర్టీసి బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కడప న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బి. గుర్రప్ప, న్యాయవాదులు, ఎన్జీఓలు, ట్రాన్స్ జెండర్స్, గిరిజనులు, కార్మికులు, కోర్టు సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం


లారీ కింద పడిన మృతిచెందిన ఎంహెచ్.లక్ష్మి

కడప అర్బన్ : కడప నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ లక్ష్మిదేవి(28) దుర్మరణం పాలయ్యారు. పోలీసుల వివరాల మేరకు.. అక్కాయపల్లి-చౌటపల్లి రోడ్డులో నివాసముంటున్న నవీన్ భార్య లక్ష్మిదేవి నగర శివారులోని డీఆర్‌డీఏ ట్రైనింగ్ సెంటర్‌లో బ్యూటీషియన్ కోర్సు నేర్చుకుంటోంది. యథాప్రకారం శిక్షణకు వచ్చిన లక్ష్మిదేవి ముగిసిన అనంతరం భర్త నవీన్ బైక్‌లో తిరిగి ఇంటికి వెళ్తోంది. ఐటీసీ రోడ్డులో వేగంగా గ్యాస్ సిలిండర్ల లారీ ఢీకొనడంతో అదుపు తప్పి లారీ కింద పడిన లక్ష్మిదేవి అక్కడికక్కడే మృతిచెందారు. రిమ్స్ సీఐ కె.రామచంద్ర ఆదేశాల మేరకు ఎస్ఐ నారాయణ విచారణ చేపట్టారు.

యువకుడిపై ఎస్ఐ దాడి


ఎస్ఐ దాడిలో గాయపడిన నవదీప్‌కు చికిత్స చేయిస్తున్న తండ్రి, న్యాయవాది జి.గుర్రప్ప


నవదీప్ ఒంటిపై గాయాలు

కడప అర్బన్ : కడప నగరంలోని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం రాత్రి రాజీవ్ పార్క్ వద్ద నవదీప్ అనే యువకుడిపై ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి లాఠీతో దాడి చేసి గాయపరిచిన సంఘటన చోటు చేసుకుంది. ఈ సంఘటనపై బాధిత యువకుడు నవదీప్, అతని తండ్రి, న్యాయవాది జి. గుర్రప్ప తెలిపిన సమాచారం మేరకు.. నవదీప్ ఇంటి నుంచి స్కూటీలో రాజీవ్ పార్క్ వద్దకు పానీ పూరీ తినేందుకు వచ్చాడు. ఆ సమయంలో పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తున్నారు. తాను వచ్చిన స్కూటీ ఆప లేదనీ ఎస్ఐ తనపై లాఠీతో దాడి చేశాడని నవదీప్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తన కాలికి ఆపరేషన్ జరిగిందని, ఆ ప్రదేశంలో లాఠీతో కొట్టడంతో గాయమైందని తెలిపారు. ఇంకా తన శరీరంపై లాఠీ దెబ్బలతో వాతలు పడ్డాయని తెలియజేశారు. ప్రస్తుతం నవదీప్ కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ సంఘటనపై ఎస్ఐ మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా, నవదీప్ స్కూటీలో వేగంగా వచ్చాడని, తనిఖీలలో భాగంగా ఆపుదామన్నా, ఆపకుండా ఏకంగా తనను ఢీకొట్టాడని, చేయి మణికట్టుకు దెబ్బ తగిలిందని తెలియజేశాడు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించండి


మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

దువ్వూరు : మండల వ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో ఆయా పంచాయతీ కార్యదర్శులు పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యాదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో డయేరియా లాంటి వ్యాధులు ప్రబలకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచేలా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. వారానికి ఒక సారి మంచినీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేసిన శుభ్రమైన నీటిని ప్రజలకు అందించాలని ఆదేశించారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శివప్రసాద్, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నాగేంద్రబాబు పాల్గొన్నారు.

మొరాయించిన కంప్యూటర్లు.. వాహనాల బారులు

ఖాజీపేట: కర్నూలు- కడప జాతీయ రహదారిపై దుంపలగట్టు టోల్‌గేట్ వద్ద శనివారం కంప్యూటర్లు మొరాయించాయి. వాహనాలు బారులు తీరి నిలవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. డబ్బు చెల్లించాల్సిన ఫాస్ట్ ట్రాక్ స్కానర్ పనిచేయక పోవడమే ఇందుకు కారణం. అదే సమయంలో అంబులెన్స్ రావడంతో వాహన దారులు ప్రత్యేక దారి ఇచ్చి పంపించి వేశారు. కొద్ది సేపటి తర్వాత స్కానర్లు పనిచేయడంతో వాహనాలు బయలుదేరాయి.

కొత్త రీజినల్ డైరెక్టర్ రాకపై ఉత్కంఠ

వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 ఉద్యోగుల్లో చర్చ


కడపలోని వైద్య ఆరోగ్య శాఖ జోన్-4 ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్ : ఏదైనా ఒక ప్రభుత్వ శాఖలో అధికారుల మార్పులు.. చేర్పులు ఉంటే ఉద్యోగుల్లో ఒకింత ఆసక్తి నెలకొంటుంది. వచ్చే అధికారి వ్యవహార శైలిపై చర్చించుకోవడం మొదలవుతుంది. అదే కీలక శాఖ అయితే తీవ్ర చర్చ కొనసాగుతుంది. ప్రస్తుతం కడప ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం (జోన్-4)కి కొత్తగా వచ్చే రీజినల్ డైరెక్టర్ రాకపై ఆసక్తికరమైన చర్చ సాగుతోంది. ప్రస్తుతం ఆ శాఖ రీజినల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న డాక్టర్ రత్నకుమారి ఈ నెల 31వ తేదీన ఉద్యోగ విరమణ పొందనున్నారు. ఆగస్టు 1వ తేదీన ఈ స్థానంలోకి కొత్త ఆర్డీ బాధ్యతలు స్వీకరించాల్సి వుంది. ఈ నేపథ్యంలో ఈ స్థానంలోకి కొత్తగా వచ్చే రీజినల్ డైరెక్టర్ రాకపై ఆసక్తి నెలకొంది. డాక్టర్ రత్నకుమారి ఇక్కడ 2023 అక్టోబర్ 22వ తేదీ నుంచి బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. అంతకు ముందు ఈ స్థానంలోకి 'వాళ్లొస్తారు.. వీళ్లొస్తారని' పెద్ద ఎత్తున ఊహాగానాలు చెలరేగాయి. చివరికి ఎవరూ ఊహించని విధంగా ఇక్కడికి డాక్టర్ రత్నకుమారి వచ్చి బాధ్యతలు స్వీకరించడంతో అంతా అవాక్కయ్యారు. కాగా ఈ శాఖ పరిధిలో వైఎస్సార్ జిల్లాతో పాటు, కర్నూలు, నంద్యాల, అన్నమయ్య, తిరుపతి, శ్రీ సత్యసాయి, అనంతపురం, చిత్తూరు జిల్లాలు వస్తాయి. ఈ శాఖ కింద దాదాపు 17 కేడర్లకు చెందిన 13 వేల మందికి పైగా ఉద్యోగులు పని చేస్తున్నారు. వారి ఉద్యోగ పాలనాపరమైన పదోన్నతులు, సర్వీసు, ఉద్యోగ నియామకాలు ఇలాంటి అంశాలన్నీ ఆర్డీ కార్యాలయంపై ఆధారపడి ఉంటాయి. అందువల్ల ఈ శాఖలో ఏ సంఘటన జరిగినా చర్చనీయాంశంగా ఉంటుంది. ఇప్పటి నుంచే కొత్త ఆర్డీ రాక నేపథ్యంలో 'వచ్చే అధికారి ఎలాంటి వారు.. మాకు అనుకూలమా కాదా.. మా పనులు జరుగుతాయా లేదా' అనే చర్చ జోరుగా సాగుతోంది. ఇక్కడికి ఆర్డీగా రావడానికి తీవ్ర పోటీ ఉంటుంది. ఇప్పటికే కొంత మంది రాయలసీమ ప్రాంతానికి చెందిన ఆ శాఖ అధికారులు రేసులో ఉన్నట్లుగా సమాచారం. అదే సందర్భంలో ఎవరూ ఊహించిన విధంగా ఇక్కడికి ఆర్డీగా మరెవరైనా వచ్చినా ఆశ్చర్యపోనవసరం లేదు. కాగా ఆర్డీగా డాక్టర్ రత్నకుమారి ఉద్యోగ విరమణ పొందిన తరువాత జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిగా పని చేస్తున్న డాక్టర్ నాగరాజును ఇన్‌చార్జి ఆర్డీగా నియమించే అవకాశం ఉంది. తరువాత రెగ్యులర్ ఆర్డీని నియమించవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం జోన్-4 పరిధిలోని ఆ శాఖ ఉద్యోగుల్లో కొత్త ఆర్డీ రాక అంశం చర్చనీయాంశంగా మారింది.

WANTED TEACHERS
Wanted Social Teacher to Handle
9th and 10th Classes.
Salary 38000 - 40,000
Interested Candidates Contact immediately.
SRI SAI VIDYANIKETHAN SCHOOL
BADVEL
CELL : 9440852868, 9492102868

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION
■ఒకే సం॥లో ఓపెన్ టెన్త్, ఇంటర్/మరియు డిగ్రీ/పీజీ. దూర విద్యా ద్వారా 2024/24 అన్ని గ్రూపులు అడ్మిషన్లు ప్రారంభమైనవి. శ్రీహరి ఎడ్యుకేషన్ స్టడీ సెంటర్ 9849408340, 8639738808, కడప

REALESTATE
TO-LET
■ Christian lane 3500 sqft Building beside Dr.Sridharreddy Hospital Cont : 9603517722, 7093100457

SERIVCES
BUSINESS OFFER
■We are Ready to Invest Long Term Projects All Over the World. Ph : +91 8754809650

HEALTH CARE
NEURO
■డా॥M.సుధాకర్‌రావు M.D(Gold Medalist) D.M. (Neurology) అన్ని రకముల మెదడు, వెన్నుపూస,నరముల జబ్బులు చూడబడును, సుధాకర్ న్యూరో క్యూర్, రెడ్డి & రెడ్డి కాలని, తిరుపతి,0877-2250600,9949916060.

RHEUMATOLOGY
■డా.పి.దామోదరం,MD,DM(NIMS)రుమటాలజిస్ట్-కీళ్ళవాతం నిపుణులు,శుభోదయ రుమటాలజీ సెంటర్,Opp. SBH Bank, జయనగర్, తిరుపతి,9391344644, 9704582045.

WANTED
■కడప జిల్లాలో గల గ్రామీణ ప్రాంతాల వారికి మా సంస్థలో 28 స్త్రీ/పు లకు ఉద్యోగాలు. జీతం. 18వేలు+ DA 6వేలు+రూంఫ్రీ, (నో ఫీజు). అ: 10th-డిగ్రీ (P/F) చెన్నూరు బస్టాండ్ దగ్గర, కడప. ఫోన్ 85024 00850.
■కళ్లున్నట్లే కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు / పురుషులు, ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డ్రైవర్స్ కావలెను. జీ: 15000-40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD. ఫోన్ 7995084445
■ Wanted Telecallers : కడపలో పని చేయుటకు అనుభవం కలిగిన Telecallers కావలెను. Degree & MBA. Call me : 7013897435.
■పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.
■త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను ,పేషెంట్స్‌ను,చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీవసతి+ భోజనం. జీతం:17K ఫోన్: 8520980099, 8520874499

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, ప్రకటన ఇచ్చిన వారితో లావాదేవీలు జరిపే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోండి. ప్రకటనలలోని విషయాలకు సాక్షి యాజమాన్యం బాధ్యత వహించదు. ఈ విషయాన్ని గమనించగలరు.